# 2- మంచి వైపుకు పిలుపునివ్వడం మరియు చెడుల నుంచి వారించడం విధి

మానవత్వం గల కలిగిన ప్రతి మనిషి మంచిని బోధించాలి మరియు చెడు నుండి హెచ్చరించాలి. మన సమాజంలో అనేక మంది చెడు గురించి చెప్పాలన్నా లేక ఎత్తి చూపాలన్నా మనకెందుకులే అన్న భావంతో తప్పుకుంటారు. లేదా ఎవరు ఎలా పోయినా మనకెందుకులే అని నడుచుకుంటారు. చివరికి ఆ చెడు ప్రభావం మొత్తం సమాజంపై పడుతుంది.

ధర్మ పరంగా ఉన్న విషయాలను బోధించడం మహా పుణ్య కార్యం. అలాగే ధర్మానికి వ్యతిరేకంగా ఉన్న షిర్క్ మరియు బిద్అత్ కార్యాలకు పాల్పడకుండా ప్రజలను అప్రమత్తం చేయడం కూడా పుణ్య ప్రదమే. ఎందుకంటే? షిర్క్ మరియు బిద్అత్ కార్యాలు మన విశ్వాస జీవితాన్ని మరియు మన పుణ్యాలన్ని నాశనం చేస్తాయి. వాటి కారణంగా ప్రజలు నరకానికి ఆహుతి అవుతారు. కనుక ఖుర్ఆన్ గ్రంథంలో అల్లాహ్ ఇలా తెలియజేసాడు:

﴿ وَلْتَكُن مِّنكُمْ أُمَّةٌ يَدْعُونَ إِلَى الْخَيْرِ وَيَأْمُرُونَ بِالْمَعْرُوفِ وَيَنْهَوْنَ عَنِ الْمُنكَرِ ۚ وَأُولَٰئِكَ هُمُ الْمُفْلِحُونَ ﴿١٠٤﴾ ﴾ آل عمران: ١٠٤

**‘‘మేలు వైపుకు పిలిచే, మంచిని చెయ్యమని ఆజ్ఞాపించే, చెడుల నుంచి వారించే ఒక వర్గం మీలో ఉండాలి. ఈ పనిని చేసే వారే సాఫల్యాన్ని పొందుతారు.’’** (సూరతు ఆల ఇమ్రాన్:104)

హ్జ్రత్ హుజైఫా బిన్ అల్ యమాన్(రజియల్లాహు అన్హు) గారు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారితో చెడుల గురించి అడిగి తెలుసుకొని వాటికి దూరంగా ఉండేవారు. కనుక ఆయన ఇలా తెలియజేసారు:

**كَانَ النَّاسُ يَسْأَلُونَ رَسُولَ اللَّهِ صَلَّى اللَّهُ عَلَيْهِ وَسَلَّمَ عَنْ الْخَيْرِ وَكُنْتُ أَسْأَلُهُ عَنْ الشَّرِّ مَخَافَةَ أَنْ يُدْرِكَنِي.** (رواه البخاري:3338)

ప్రజలు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) గారితో మంచి విషయాల గురించి అడిగేవారు. కాని నేను ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారితో **''చెడు విషయాల గురించి అడిగి తెలుసుకొనేవాడిని. ఎక్కడ నేను చెడు విషయాలకు గురికాబడతాననే భయంతో అలా చేసేవాణ్ణి.''**

(బుఖారీ:3338)

ఆరాధనలకై **'సున్నత్'** విషయాల పట్ల అవగాహన కలిగి ఉండటం ఎంత ముఖ్యమో, బిత్అత్ విషయాల పట్ల జ్ఞానవంతులుగా ఉండటం కూడా అంతే ముఖ్యం. ఎలాగైతే తౌహీద్ గురించి జ్ఞానం కలిగి ఉండటం ముఖ్యమో, షిర్క్ గురించిన జ్ఞానం కలిగి ఉండటం కూడా అంతే ముఖ్యం.

కనుక అల్లాహ్ ప్రవక్తలను అవతరింపజేసిన ముఖ్య కారణాన్ని ఇలా తెలియజేసాడు:

**﴿ فَمَن يَكْفُرْ بِالطَّاغُوتِ وَيُؤْمِن بِاللَّهِ فَقَدِ اسْتَمْسَكَ بِالْعُرْوَةِ الْوُثْقَىٰ لَا انفِصَامَ لَهَا ۗ وَاللَّهُ سَمِيعٌ عَلِيمٌ ﴿٢٥٦﴾ ﴾ البقرة: ٢٥٦**

**''కనుక ఎవరయితే వేరితర ఆరాధ్యులను (తాగూత్ను) తిరస్కరించి అల్లాహ్ను మాత్రమే విశ్వసిస్తారో వారు దృఢమైన కడియాన్ని పట్టుకున్నారు. అది ఎన్నటికీ తెగదు. అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వం చూసేవాడు.''** (సూరతుల్ బఖరా:256)

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరయితే **'లా ఇలాహ ఇల్లల్లాహ్'** అని చెప్పి, తరువాత అల్లాహ్‌ను మినహా ఇతర ఆరాధ్యులను తిరస్కరిస్తారో, అతని ధనం, అతని రక్తం **(ప్రాణం)** సురక్షితం. మరియు అతని లెక్కాచారం అల్లాహ్ అధీనంలో ఉంటుంది.'' (ముస్లిం).

ఖుర్‌ఆన్ ఆయతులలోను మరియు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవచనం ద్వారా స్పష్టమయ్యేదేమంటే? మనిషి అల్లాహ్‌ను విశ్వసించిన తరువాత మిథ్యాదైవాలను తిరస్కరించాలి. అదే విధంగా మనం ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) సాంప్రదాయాలను తెలుసుకున్న తరువాత బిద్అత్ కార్యాల అనుసరణ నుండి అప్రమత్తంగా ఉండవలసిన బాధ్యత కూడా మనపైనే ఉంది. కనుక ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

**''మీరు నా 'సున్నత్'ను ఖచ్చితంగా పాటించండి, మరియు రుజు మార్గంపై నడుచుకున్న 'ఖులఫావుర్ రాషిదూన్' మార్గాన్ని పాటించండి. అదే మార్గంపై స్థిరంగా ఉండండి. మరియు ధర్మంలో బిద్అత్ ఆచారాలకు పాల్పడకండి. నిశ్చయంగా ప్రతి బిద్అత్ మార్గవిహీనమైనది.''**

(అబూదావూద్:4607, తిర్మిజీ:2676, ఇబ్నుమాజా:114, అహ్మద్)

ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''విశ్వాసం (ధర్మం) అపరిచిత పరిస్థితుల్లో ప్రారంభమయింది. తిరిగి ఆ అపరిచిత పరిస్థితికే పునరావృతమవుతాది. ఆ నాటి అపరిచితులకు శుభవార్త!'' అని అన్నారు. వారెవరూ అని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని కొందరు అడిగారు. దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం):

**‘‘నా తరువాత ప్రజలు చెరిపివేసిన నా సాంప్రదాయాన్ని పునరుద్ధరించేవారు’’** అని అన్నారు. (సిల్‌సిలతుస్ సహీహా:1273)

ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

**مَنْ رَأَى مِنكُمْ مُنْكَرًا فَلْيُغَيِّرْهُ بِيَدِهِ فَإِنْ لَمْ يَسْتَطِعْ فَبِلِسَانِهِ فَإِنْ لَمْ يَسْتَطِعْ فَبِقَلْبِهِ وَذَلِكَ أَضْعَفُ الْإِيمَانِ (رواه مسلم :70)**

‘‘మీలో ఎవరైనా చెడు జరుగుతుండటం చూస్తే దాన్ని చేత్తో ఆపటానికి ప్రయత్నించండి. అంత శక్తి లేకపోతే నోటితోనైనా దాన్ని వారించండి. అదీ చేయలేకపోతే కనీసం మనసులోనైనా దానిని చెడుగా భావించండి. ఇది విశ్వాసపు అతి బలహీన స్థాయి.’’(ముస్లిం:70)

అంటే; ప్రవక్త యొక్క ఆదేశాల ప్రకారం షిర్క్, మరియు బిద్‌అత్ వంటి అధర్మ కార్యాల గురించి ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తూనే ఉండాలి. ప్రజలు చెరిపివేసిన ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) సాంప్రదాయాన్ని ఖుర్‌ఆన్, ప్రామాణికమైన హదీసుల ఆధారంగా బోధిస్తూనే ఉండాలి. ఎవరు ఎన్ని విధాల ఆటంకాలు సృష్టించినా, ఎన్ని విధాలుగా బాధించినా వారితో భయపడి తమ ధర్మ కర్తవ్యాన్ని నిర్వహించడం మానుకోరాదు.

ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేసారు:

**إنَّ النَّاس إذا رَأَوا مُنْكَراً فَلَمْ يُغيّروه ، يُوشِكُ أن يَعُمَّهُمُ اللَّهُ بِعِقَابِهِ (رواه أحمد، ابن ماجه، والترمذي:2168– ابوداود:4338 )**

**‘‘చెడు జరుగుతున్నప్పుడు ప్రజలు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తే, దాన్ని సంస్కరించే ప్రయత్నం చేయకపోతే అల్లాహ్ వారిని తన శిక్షకు గురిచేసే సమయం దగ్గర పడిందనుకోండి.’’**

(ముస్నద్ అహ్మద్, తిర్మిజీ:2168, అబూదావూద్:4338)